




## (గత సంచిక తరువాయి)

13

ఇల్లంతా రాలిపడిన పూరేకులతో, అక్షంతలతో, వసంతాగమనం కోసం ఎదురు చూస్తున్న పూదోటలా ఉంది. పెళ్లివాళ్ళకి వీడ్కోలు చెప్పడానికి గేటు బయటకి వెళ్ళారు మాధవ, వర్ధని, నాంచారమ్మ.

తనువంతా విరుల, సౌగంధాల పరిమళాలతో, గుండెల నిండా పులకింతల బరువుతో వంటగది గుమ్మంలో చెక్కిన శిల్పంలా నిలబడిపోయిన పవిత్ర వాళ్ళు గేటు తీసిన శబ్దం విని, అడుగులో అడుగు వేస్తూ హాల్లోకి వచ్చి, కిటికీ దగ్గరగా నడిచి రెక్క చాటు నుంచి తొంగి చూసింది. కాంపౌండ్ వాల్ అడ్డు రావడంతో నిరాశగా వెనక్కి తిరిగింది. ఆమె అలా తిరగడంతో పొడుగాటి జడ అటూ, ఇటూ ఊగి ముందుకి కుడివైపు పడింది.

ఒక్కసారి హాలంతా కలయచూసింది. శివ కూర్చున్న సోఫా దగ్గరగా నడిచి కొద్దిగా ఒంగి అతను కూర్చుని లేచిన వైపు మొహం వంచి చెంపలు సోఫాకి తాకించి, ఫక్కున నవ్వింది. అక్కడి నుంచి అన్ని సోఫాలు ఎక్కడివక్కడ జరిపేసింది.

"ఇంకెంత? మహా అంటే రెండు నెలలు ఈ ఇంట్లో తను ఉంటుంది. ఆ తరవాత... ఆ తరవాత చెంపలు మందారాలు అయితే, కళ్ళు కలువలైనాయి. ఒళ్లంతా పూలగంప అయింది.

జడలోని కనకాంబరాల మాల గుసగుసలు చెబుతున్నట్టు మెడ మీద వాలి గిలిగింతలు పెడుతుంటే, వయ్యారంగా ఒంగి, ఇల్లంతా రాలిన పూరేకులు కుప్పగా చేసి, గుప్పిట్లోకి తీసుకుని లేడి పిల్లలా చెంగు, చెంగున రెండేసి మెట్ల చొప్పున ఎక్కుతూ తన గదిలోకి వెళ్ళిపోయి, మంచం మీద వెల్లకిలా పడిపోయి, ఆ పూరేకులన్నీ గుండెల మీద పోసుకుంది పవిత్ర.

కళ్ళు తెరిచి సీలింగ్ ని చూస్తుంటే గుండ్రంగా తిరుగుతున్న ఫ్యాన్ అందమైన సరోవరంలో, పెద్ద రేకులతో విచ్చుకున్న కమలంలా కనిపించింది. ఆ కమలంలో పద్మాసనంలో కూర్చుని తను ఎక్కడికో వెళ్తోంది... మరో పక్క నుంచి మరో కమలం మీద అతను చేతులు చాచి తనవైపు వస్తున్నాడు.

గబుక్కున బోర్లా పడుకుని మొహం దిండులో దాచుకుంది.

అకస్మాత్తుగా ఫ్యాన్, పొగడపూల చెట్టు అయి, తన శరీరం మీద గుత్తులు, గుత్తులుగా పూలు రాలుస్తున్నట్టు ఒక మెత్తని, పరిమళ భరితము, మధురము అయిన అనుభూతి...

ఎక్కడి నుంచో తెలుగు మాష్టారి స్వరం వినిపిస్తోంది...

పూలబరువున నిప్పుడు నెల వ్రాలు
చుంటి శాఖల తోడుత నొక్కమనవి
వినుము గోదావరీతీర వికట కుంజ
మండలి మధూకమా! రాల్చు మందముగను !

"పవిత్రా!" చెవిలో మత్తుగా వినిపించింది శివ స్వరం.

ఒక్కసారి గుండె జల్లుమంది.

చెంపల మీద వెచ్చటి స్పర్శ... గుండే కాదు, శరీరం యావత్తూ లయ తప్పినట్టు అయింది. గబుక్కున తలగడ లో నుంచి తలతిప్పి చూసింది.

కిటికీ అవతల పడమటి కనుమల్లో అస్తమిస్తున్న సూర్యకిరణం కిటికీ లో నుంచి పరావర్తనం చెంది, ఆమె చెంపల మీద పడింది.

ఎంత బాగుంది ఈ స్పర్శ! ఒక్కసారి చెంప మీద తడుముకుంది.

శివ ఎంత బాగున్నాడు ఇవాళ! తెల్లని పైజమా, లాల్చీలో అందంగా! అతని రూపం కళ్ళ ముందు కదిలింది.

ఈ అందగాడు నా భర్త కాబోతున్నాడా? అనడిగింది తలగడని.

అవునన్నట్టు చెంపమీద సుతారంగా ఆనింది తలగడ కొస.

మెత్తగా పొట్టని తాకుతున్న పసుపురంగు బనారస్ చీర చెంగు అతని మెత్తని చేతి స్పర్శలా ఉంది.

నిపుణుడైన వైణికుడు తీయనిరాగాల రాగమాలిక మెడలో వేసినట్టు ఆపాద మస్తకం పులకించిపోయింది.

ఆ కదలికకి మెడలోని రెండు వరసల కాసికాయ గుండ్ల దండ గుండెల మీద కదిలింది.

నవలతికా తాడనంతో పులకరిస్తున్న కావ్యనాయిక అయింది పవిత్ర.

"పవిత్రా!" మేఘాల మీద విహరిస్తున్న హంస హటాత్తుగా కింద పడినట్టు అనిపించింది.

కింద నుంచి తండ్రి స్వరం... గబుక్కున మంచం మీద నుంచి లేచి, చెదిరిన జుట్టు సవరించుకుని, చీర మీద పడిన పూలరేకులు దులుపుకుని గదిలోనుంచి బయటకు వచ్చి, పై మెట్టు దగ్గర నిలబడి అడిగింది "పిలిచావా నాన్నా?"

"కిందికి రా" అన్నాడు మాధవ. ఆయన స్వరం గంభీరంగా ఉంది. అంతకు ముందు జరిగిన ఒక శుభకార్యపు ఆనందం ఆ స్వరంలో ధ్వనించడం లేదు. ఆయన పక్కనే వర్ధని నిలబడి ఉంది. అప్పటివరకు తీయని ఊహలతో స్వర్గద్వారాలను చేరబోతున్న తనని, ఎవరో హటాత్తుగా భుజాలు పట్టి లాగేసినట్టు ఊహల లోకం నుంచి వాస్తవం లోకి వచ్చింది. గుండె దడదడలాడింది.

నానమ్మ కోసం ఆమె కళ్ళు వెతికాయి. ఆవిడ ఎక్కడా కనిపించలేదు. తల్లి వైపు చూసింది. ఆవిడ పెరటి గుమ్మం వైపు తలతిప్పి చూస్తోంది.

ముందుకు పడిన జడ చివరలు కుడిచేత్తో పట్టుకుని, ఎడం చేత్తో మెలికలు తిప్పుతూ ఒక్కో మెట్టే దిగసాగింది.

"త్వరగా రా" కొంచెం విసుగ్గా అన్నాడాయన.

అదిరిపడుతున్న గుండె చిక్కబట్టుకుని వేగంగా మెట్లు దిగి ఆయన ముందు నిలబడి "ఏమైంది నాన్నా?" అనడిగింది.

"మోహన్ ని నువ్వు ఎప్పుడు కలిసావు ఆఖరిగా?" ఊహించని ఆ ప్రశ్నకి నిరుత్తరురాలై చూడసాగింది.

"అడిగేది నిన్నే... ఎప్పుడు కలిసాడు నిన్ను?" కొంచెం గదమాయింపుగా అడిగాడు.

ఉలిక్కిపడి, గుర్తుకుతెచ్చుకుంటూ చెప్పబోతుండగా పక్కింట్లో నుంచి ఏడుపు వినిపించింది.

ఆ ఏడుపు వినగానే వర్ధని ఉలిక్కిపడి, పెరటివైపు వెళ్ళింది.

నాంచారమ్మ వీధి వాకిట్లో నుంచి గబగబా వస్తూ "బాగా పెద్ద దెబ్బే తగిలిందిట రా. ఆస్పత్రిలో చేర్చారుట... వాళ్ళు బయలుదేరారు ఆస్పత్రికి నువ్వు కూడా వెళ్తే బాగుంటుందిరా " అంది.

మాధవ ఒక్కసారి కళ్ళు గట్టిగా మూసుకుని నిటారుగా అయి అన్నాడు" ఆరోజు నుంచీ ఆయన నాతో మాట్లాడడం లేదమ్మా... వెళ్ళనా వద్దా అని ఆలోచిస్తున్నాను."

"ఇలాంటప్పుడు అలాంటి పంతాలు, పట్టింపులు ఎందుకు నాయనా? ఎంతైనా ఇరుగుపొరుగు వాళ్ళం. పిల్లాడు మనకి ఎంతో సహాయం చేసాడు. వాడికి ప్రమాదంగా ఉందని తెలిసీ వెళ్లకపోతే బాగుంటుందా? వెళ్ళు... వర్ధనిని కూడా తీసుకుని వెళ్ళు" అంది నాంచారమ్మ.

వాళ్ళ సంభాషణ అర్థం కాని పవిత్ర అయోమయంగా చూడసాగింది ఇద్దరినీ మార్చి, మార్చి.

"ఏమైంది నానమ్మా?" అనడిగింది నాంచారమ్మ దగ్గరగా వెళ్లి.

ఆవిడ చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ సమాధానం ఇచ్చింది. "పాపం మోహన్ ని ఎవరో బాగా కొట్టి రైలు పట్టాల మీద పడేసారుట, చాలా ప్రమాదంగా ఉందని ఎవరో వచ్చి వాళ్ళ అమ్మా,నాన్నలకి చెబుతున్నారు. మేము పెళ్లివాళ్ళని పంపించడానికి వీధిలోకి వెళ్ళినప్పుడే ఇద్దరు మనుషులు వచ్చారు. పాపం పిల్లాడు వాడి మీద అంత కక్ష ఎవరికుందో!"

స్థాణువైంది పవిత్ర. మోహన్ ని ఎవరో కొట్టారా? ప్రమాదకరంగా ఉందా అతని పరిస్థితి...

ఎందుకు కొట్టారు? ఎవరు కొడతారు ఈ ఊళ్ళో. వాళ్ళ నాన్నగారికి మంచిపేరు ఉంది. మోహన్ కి తను తప్ప వేరే శత్రువులు కూడా లేరు. నిజానికి అతను ఎంతో మంచివాడు. కాలేజ్ లో చాలా మంది పిల్లలు క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు

వెళ్తారు. వాళ్ళంతా మోహన్ నోట్స్ అడిగి తీసుకుని కాపీ చేసుకుంటారు. అందరితో స్నేహంగా ఉంటాడు. తన ఫ్రెండ్స్ కి కూడా మోహన్ అంటే మంచి అభిప్రాయం ఉంది. తనకే అతనంటే ఇష్టం లేదు, కారణం అతను తన వెంట పడుతున్నాడు. కానీ అలా అని తను అతన్ని ఏనాడూ చెంప మీద కొట్టడం లాంటివి చేయలేదు. కేవలం మాటలే కరుకుగా అనేది. మరి అతన్ని కొట్టే సాహసం చేసి ఉంటారు? ఎవరు చేసి ఉంటారు ఆ పని?

లేదు, ఎవరూ కొట్టలేదు. బహుశా అతను తను కాదందని... వణికిపోయింది పవిత్ర ఆ ఆలోచనకి. అలా జరక్కూడదు... అలా జరక్కూడదు అనుకుంది.

“వర్దనీ!” మాధవ పెరట్లో ఉన్న వర్ధనిని పిలిచాడు.

ఆవిడ వేగంగా నడుచుకుంటూ వచ్చి “పాపం ఆవిడ ఏడుస్తోందండి. గుండె కరిగిపోతోంది. పదండి వెళదాం మనం కూడా” అంది.

“పద... ఏదైతే అది అయింది. వాళ్ళు అవమానించినా భరిద్దాం.” గంభీరంగా అంటూ వీధి వాకిలివైపు నడిచాడు. ఆయన్ని అనుసరించింది వర్ధని.

“ఎలా ఉన్నాడో ఏవిటో! నల్లగా ఉన్నా బంగారంలాంటి మనసున్న పిల్లాడు. వాడి మీద ఎవరికే కక్ష? వాళ్ళ చేతులు విరిగిపోనూ! అతన్ని కొట్టడానికి చేతులు ఎలా వచ్చాయి? వాళ్ళు నాశనం కానూ!” నాంచారమ్మ సోఫాలో కూలబడి, రోదించసాగింది.

బొమ్మలా నడుచుకుంటూ ఆవిడ దగ్గరకు వెళ్లి “నానమ్మా! మోహన్ మీద హత్యాప్రయత్నం జరిగిందా?” అనడిగింది పవిత్ర.

ఆవిడ తెల్లబోయి చూసింది మనవరాలి వైపు. “హత్యా? అంటే అతన్ని చంపడానికి కొట్టారనా? ఎందుకు? ఎందుకు? ఎవరు చంపుతారు? ఎవరికీ అంత కక్ష? అతను ఎవరికేం అపకారం చేసాడు?” ఆవిడ వెంట, వెంటనే ప్రశ్నలతో దాడిచేసింది.

“నాకు తెలియదు. నాకేం తెలుసు? మరి ఎందుకు కొట్టారు? ఎవరు కొట్టారు?” ఆవిడ ప్రశ్నల ధాటికి బెదిరిపోతూ అంది పవిత్ర.

“అదే తెలిస్తే దాడి చేసిన వాడి పీక నులిమి వచ్చేదాన్ని. తెలీకేగా ఈ బాధ. పాపం ఆ తల్లి కడుపుశోకం ఎవరు తీరుస్తారు? ఇంతకాలంగా బంధువుల్లా కలిసి ఉన్నవాళ్ళం. నేనే చెడగొట్టాను బంధం. ఏదో ఆశపడ్డాడు పిల్లాడు... కాదని సున్నితంగా చెప్తే పోయేదానికి, నోటికి వచ్చినట్టు తిట్టాను. నా తిట్లే తగిలాయేమో! వాళ్ళు ఇదేమాట అని నన్ను శాపనార్ధాలు పెట్టరూ! ఏవిటో శుభమా అని నీ ప్రదానం చేసుకుంటే, ఆ ఆనందం అరగంట కూడా మనసులో మిగలకుండా ఈ దారుణం జరిగిందని తెలిసింది. ఆ పిల్లాడు బతికి బయట పడ్డాడా మనం బతికిపోతాం. ఏదన్నా జరిగితే జీవితాంతం వాళ్ళ ఉసురుపోసుకుంటాం. “

ఆవేదనతో కూడిన నాంచారమ్మ వాగ్ధాటి కొనసాగుతూనే ఉంది.

పవిత్రకి కాళ్ళు, చేతులు వణికిపోతున్నాయి. అస్థిమితంగా ఉంది. అక్కడి నుంచి లేచి పెరట్లోకి వెళ్ళింది.

"ఎలా జరిగింది? మోహన్ రైల్వే స్టేషన్ కి ఎందుకు వెళ్ళాడు?"

ఆ రెండు ప్రశ్నలు వేయి కొరడా దెబ్బల్లా తగులుతున్నాయి. ఎలా జరిగింది? మరోసారి ప్రశ్నించుకుంది.

నిజంగా ఎవరన్నా కొట్టారా? ఎవరూ కొట్టే అవకాశం లేదు. ఎందుక కొడతారు? ఏం తప్పు చేసాడని కొడతారు? కచ్చితంగా తన పెళ్లి అవుతోందని చాలా బాధపడి ఉంటాడు. తనని ఎంతో ప్రేమిస్తున్నాడు. తనకి కోపం వచ్చింది. నిజమే! కానీ, అతన్ని ప్రేమించద్దు అని చెప్పలేదు కదా! ప్రేమించాడు, ప్రేమిస్తూనే ఉన్నాడు. పెళ్లి చేసుకోవాలి అనుకుంటున్నాడు. ఇప్పుడు ఇంక ఆ ఆశ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. మోహన్ ఎంతో గాడంగా ప్రేమిస్తున్నాడు. తను లేకుండా బతకలేను అని కూడా చెప్పాడు. అదంతా కొట్టిపారేసింది. హేళనగా తీసుకుంది. కానీ, కానీ అతను హృదయానికి తీసుకున్నాడు. అందుకే, అందుకే...

ఒక్కసారిగా ఒళ్లంతా చెమటలు పట్టి భయంతో వణికిపోతూ "నానమ్మా!" అని అరుస్తూ పరిగెత్తుకుంటూ వెళ్లి ఆవిడ ఒళ్లో వాలిపోయి, వెక్కి, వెక్కి ఏడవసాగింది.

ఆవిడ నిర్ఘాంతపోయి చూసింది. ఎలాంటి విత్తు నాటకుండా అప్పటికప్పుడు మొలిచిన పెద్ద చెట్టులా ఆవిడలో ఏదో అనుమానం పుట్టుకొచ్చింది. చలిజ్వరం వచ్చినదానిలా గజగజ వణుకుతూ

"నువ్వెందుకేడుస్తున్నావు?" అనడిగింది.

"నాకు భయంగా ఉంది. మోహన్ చచ్చిపోతాడా?" వెక్కుతూ అడిగింది.

"లేదు, లేదు. మోహన్ కి ఏమీ కాదు. ఆ తల్లి చేసే పూజలు ఫలిస్తాయి. మోహన్ ఆరోగ్యంగా తిరిగివస్తాడు. భయపడకు." మనవరాలి వీపు నిమురుతూ ఓదార్పుగా అన్నదేగానీ ఆవిడ మనసులో మోహన్ ఆరోగ్యం పట్ల ఆందోళన తగ్గలేదు. భగవంతుడా! ఆ కుర్రాడిని కాపాడు. మోహన్ ఇంటికి క్షేమంగా వస్తే తిరుమల కొండ కాలినడకన ఎక్కుతాను తండ్రీ...' అంటూ ప్రార్థిస్తూ చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ, పవిత్ర వీపుమీద ఒక చేయి అలాగే ఉంచి, నిశ్చలంగా కూర్చుండిపోయింది.

పవిత్ర చాలాసేపు ఆవిడ ఒళ్లో పడుకుని వెక్కిళ్ళు పెడుతూనే ఉంది.

మోహన్ కచ్చితంగా ఆత్మహత్య చేసుకోడానికి వెళ్ళాడు అని బలంగా నమ్ముతోంది. తను కాదన్నందుకు, తన పెళ్లి శివతో నిశ్చయించినందుకు మనసు చెదిరి వెళ్ళిపోయాడు. రైలు పట్టాల మీద తల పెడుతుంటే బహుశా ఎవరో కాపాడి ఉంటారు. ఆ సమయంలో దెబ్బ తగిలి ఉంటుంది అని ఆమె భావించసాగింది.

నానమ్మ, మనవరాళ్ళ ఆలోచనలు అలా సాగుతూ ఉండగా బయట కారాగిన శబ్దం, గేటు తోసుకుని వర్ధని లోపలికి రావడం జరిగింది. వస్తూనే అత్తగారి పక్కన కూలబడి బావురుమంది.

"ఏమైందే? ఎలా ఉన్నాడు ఆ అబ్బాయి? ఎందుకు ఏడుస్తున్నావు?" కంగారుగా అడిగింది నాంచారమ్మ.

"అయిపోయింది అత్తయ్యా! ఆ ఇంటితో మనకి శాశ్వతంగా బంధం తెగిపోయింది." వెక్కుతూ అంది వర్ధని.

"అంటే! అంటే!" ఆవిడ వెర్రిగా కోడలి మొహంలోకి చూసింది. పవిత్ర గబుక్కున లేచి తల్లి పక్కన కూర్చుని "అమ్మా! మోహన్!" అంది గాభరాగా.

వర్ధని దుఃఖంతో మాట్లాడలేకపోతోంది.

కారు పార్క్ చేసి వచ్చిన మాధవ రుద్ధమైన స్వరంతో చెప్పాడు." మోహన్ కి గాయం బలంగా తగిలింది. కానీ ప్రమాదం లేదు అని చెప్పాడు డాక్టర్. కానీ అమ్మా! ఇదంతా మనమే చేయించాం అని వాళ్ళు నమ్ముతున్నారు. మేము వెళ్ళగానే ఆవిడ రెండు చేతుల్లో మొహం దాచుకుని "వెళ్ళిపొండి. నా కొడుకు చావు కోరి వచ్చారా? వెళ్ళిపొండి" అంటూ ఒకటే అరుపులు, ఏడుపు. ఆయన రెండు చేతులూ జోడించి, 'మా అబ్బాయి మీ అమ్మాయిని కోరుకోడం తప్పే, పాపం కూడా. కానీ వాడు ఎంత వికారంగా ఉన్నా, వాడికీ మనసుంటుంది. ఆ మనసు మీ అమ్మాయిని ప్రేమించింది. ఆ మాత్రానికి వాడి చావు కోరుకుంటారా? మీకు మేం ఏం అపకారం చేసాం?' అని చాలా మాటలన్నాడు. పరిస్థితి అది. వాళ్ళని తప్పు పట్టలేం. కానీ అమ్మా! ఇంక మా స్నేహం పరిసమాప్తం అయింది. ఈ ఇంటికి ఆ ఇంటికి మధ్య ఎన్నటికీ చెదరని బలమైన గోడ పడిపోయింది. ఇలా ఎందుకు జరిగిందో నాకేమీ అర్థం కావడంలేదు. కానీ ఆ దైవం మీద భారం వేసి, ఆ కుర్రాడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను." ఈ మాటలనేసి లోపలికి వెళ్ళబోతూ ఆగి పవిత్ర వైపు చూసి, "నువ్వు రేపటి నుంచీ కాలేజీకి వెళ్ళద్దు. ఇంక ఈ ఇంట్లోంచి నువ్వు నీ అత్తగారింటికి వెళ్ళడం తప్ప బయటకి కాలు కదపద్దు" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

పవిత్ర బెదిరిపోతూ వర్ధని చేయి పట్టుకుంది గట్టిగా. ఆవిడ ఏమి మాట్లాడలేదు.

"నానమ్మా!" అంది పవిత్ర ఆవిడ వైపు భయంగా చూస్తూ.

నాంచారమ్మ కొద్దిసేపు మౌనంగా ఉండి గట్టిగా నిట్టూర్చి అంది. "దాని చదువు మానిపించడం ఎందుకురా? పెళ్లి అయిందాకా ఏం చేస్తుంది ఇంట్లో?" అంది కొడుక్కి వినిపించేలాగా.

మాధవ లుంగీ చుట్టుకుని వచ్చి, "దగ్గరలో ఉన్న ముహూర్తం చూసి, తాళి కట్టిస్తాను. దీని పెళ్లి అయితేగానీ, కొన్ని సమస్యలు తీరవు" అన్నాడు.

"నేనేం చేసాను నాన్నా?" బొంగురుపోయిన గొంతుతో అడిగింది పవిత్ర.

ఆయన ఆ పిల్ల వైపు సూటిగా చూస్తూ,"ఏం చేసాను అని అడుగుతావేం? తిన్నగా కాలేజ్ కి వెళ్లి చదువుకుని డిగ్రీ ఒకటి సంపాదించుకో అంటే, ప్రేమ, దోమ అంటూ ఆ డాక్టర్ వెంట తిరిగావు. నా పరువు తీసావు. ఇప్పుడు ఈ పిల్లాడు నీ కోసం, నిన్ను ప్రేమించి, నువ్వు కాదన్నావని ఆత్మహత్య చేసుకోబోయాడు అని నలుగురికీ తెలిస్తే ఎలా తలెత్తుకుని తిరగనే?

ఛ... ఏ నక్షత్రం లో పుట్టావో నీతో అన్నీ సమస్యలే. ఆ మూడు ముళ్ళు వేయిస్తాను. ఆ డాక్టర్ నువ్వు ఈ ఊరినుంచి వెళ్ళిపొండి”.

విసురుగా సిగరెట్ నోట్లో పెట్టుకుని వీధివాకిట్లోకి వెళ్ళిపోయాడు మాధవ.

“నానమ్మా! ఎందుకు నాన్న నన్ను తిడుతున్నాడు. ఆ మోహన్ అలా ఎందుకు చేయాలి?” గట్టిగా అరిచి పరిగెత్తుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయి ధడాలున తలుపేసుకుని మంచం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది పవిత్ర.

ఆ రోజంతా నిశ్చితార్థం హడావుడి, ఆనందం నిండిన ఆ ఇంట్లో ఆ రాత్రి విషాదం తాండవం చేసింది. మధురోహలతో ఉక్కిరిబిక్కిరి అయిన పవిత్ర కన్నీటి కడలి అయింది.

రెండు రోజులు అలాగే ఎవరి పని వాళ్ళు చేసుకుంటూ, సమయానికి ఏదో తిన్నాం అన్నట్టు యాంత్రికంగా గడిపారు నలుగురూ. అందరి కళ్ళు పక్కింటి మీదే. ఏ క్షణంలో ఆ ఇంటి తలుపు తెరుచుకుంటాయో లైట్లు వెలుగుతాయో అని చూస్తూనే ఉన్నారు.

రెండు రోజుల తరవాత మోహన్ కొంచెం మాట్లాడుతున్నాడు.

మధ్యాహ్నానికి డిశ్చార్జ్ చేస్తాను అని చెప్పాడు డాక్టర్. మాధవ బిల్లు కట్టడానికి వెళ్ళాడు.

డాక్టర్ కిరణ్ యువకుడు. కరణంగారి అబ్బాయి. విశాఖపట్నం లో మెడిసిన్ పూర్తి చేసుకుని వచ్చి ఆ ఊళ్ళో నర్సింగ్ హోమ్ పెట్టుకున్నాడు. అది వాళ్ళ నాన్న కోరిక. ఆయన మాటకి గౌరవం ఇచ్చి అమెరికా వెళ్ళాలన్న కోరిక చంపుకుని ఆయన కోరిక తీర్చాడు. పెద్దగా ఫీజులు తీసుకుని రోగులను బాధపెట్టే మనస్తత్వం కాదు అతనిది. అతనికి పార్థసారథి బాగా తెలుసు. ఆయనంటే గౌరవం కూడా.

ఆయన్ని చూడగానే “రండి సర్ కూర్చోండి... ఐదు నిమిషాలు” అంటూ ఏదో కేసు వివరాలు చదవసాగాడు.

ప్రస్తుతం ఆయన మనసు కొంచెం శాంతంగా ఉంది.

మోహన్ కళ్ళు తెరిచాడు. తన కొడుక్కి ప్రాణాపాయం లేదు. తను మూర్ఖంగా ప్రవర్తించి వాడి మనసు గాయం చేసాడు. బహుశా అందుకే వాడు ఇలాంటి సాహసం చేసాడు. రైలు పట్టాల మీద నడుస్తూ ఉంటే ఎవరో వచ్చి కాపాడారు... ఏ రైలో వచ్చి ఉంటె!

అదే ఆలోచనలతోటి రెండు రోజుల నుంచి ఆయన కనురెప్ప వాల్చకుండా రాత్రి, పగలు కొడుకు మంచం పక్కనే దేవుడ్ని ప్రార్థిస్తూ కూర్చున్నాడు. తన మొర దేవుడు విన్నాడు. ఈ డాక్టర్ తన కొడుకుని బతికించాడు. ఎంత ఫీజు అయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు ఆయన.

“అమ్మా!” నీరసంగా పిలిచాడు మోహన్.

ఉదయం నుంచి డాక్టర్ ప్రశ్నలకి సైగలతో సమాధానాలు చెబుతూ, కొంచెం తేరుకున్న మోహన్ నిద్రపోతున్నాడు అనుకుని అప్పుడే, కళ్ళు మూసుకున్న చాముండేశ్వరి గబుక్కున కళ్ళు తెరిచి "ఏం నాన్నా ఏం కావాలి?" అని అడిగింది.

"ఆకలేస్తోంది" అన్నాడు మోహన్.

ఆవిడ కూర్చున్న దగ్గర నుంచి లేచి బల్ల మీద ఉన్న ఫ్లాస్క్ లో నుంచి పాలు గ్లాసులో పోసి, తీసుకొచ్చి, కొడుకుకి సాయం పట్టి లేపి కూర్చోబెట్టింది.

"వేడిగా ఉన్నాయి. పాలు తాగు. నాన్న రాగానే ఇడ్లీ తెమ్మని చెప్తాను తిందువుగాని" అంది.

మోహన్ నెమ్మదిగా పాలు తాగుతున్నంత సేపు ఆవిడ అతని తల మీద చేత్తో నిమురుతూనే ఉంది. అతను తాగడం పూర్తి చేసి గ్లాసు ఇవ్వగానే తీసుకుని బల్ల మీద పెట్టి వచ్చి, మళ్ళీ మంచం పక్కన స్టూల్ మీద కూర్చుని, అతని చేయి చేతిలోకి తీసుకుని మార్దవంగా అడిగింది. "ఎలా ఉంది నాన్నా? నెప్పిగా ఉందా?"

"కొంచెం తగ్గిందమ్మా" అన్నాడు.

"ఎందుకిలా చేసావు నాన్నా?" రుద్ధమైన స్వరంతో అడిగింది.

మోహన్ ఆవిడ వైపు చూసాడు. వేసంకాలం చెరువుల్లా ఉన్నాయి ఆవిడ కళ్ళు.

ఆవిడ మళ్ళీ అడిగింది. "ఏం నాన్నా! ఆ పని చేసేముందు నీకీ అమ్మ గుర్తు రాలేదా?"

"ఏం చేసానమ్మా?" అనడిగాడు.

ఆవిడ తెల్లబోయింది. "నువ్వు చేసిన పని నీకు గుర్తులేదా నాన్నా? ఆ అమ్మాయి కోసం నాకు గర్భశోకం కలిగించాలని ఎలా అనుకున్నావురా?"

"అమ్మా నువ్వేం అంటున్నావు?"

"ఆత్మహత్య ఎందుకు చేసుకోవాలి అనుకున్నావు?"

"లేదు...లేదమ్మా నేను ఆత్మహత్య ప్రయత్నం చేయలేదు. నన్నెవరో వెనక నుంచి బలంగా తలమీద కొట్టారు." తెల్లబోతూ అన్నాడు.

ఆవిడ నిశ్చేష్టురాలైంది "నిన్ను...నిన్ను కొట్టారా? ఎవరు?"

"తెలియదు. నేను రైల్వే స్టేషన్ కి వెళ్ళి అక్కడ ప్లాట్ ఫారం మీద బెంచీ మీద కూర్చున్నాను. కాసేపటికి నా తల మీద దెబ్బ పడింది. ఒక్కసారిగా కళ్ళు బైర్లు కమ్మాయి. స్పృహ తప్పుతూ ఉండగా ఇద్దరు పరిగెత్తుకుంటూ వెళ్ళిపోడం చూసాను. అంతేనమ్మా ఇంక నాకేం తెలియదు."

ఆవిడ దిగ్భ్రాంతిగా చూసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS